సౌదీ అరేబియా విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అదెల్ అల్‌జుబేర్ గురువారం ఆకస్మికంగా భారత్‌ను సందర్శించారు. భారత్, పాకిస్థాన్ ఉద్రిక్తతలను తగ్గించే సంకల్పంతో ఆయన విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్ జైశంకర్‌తో భేటీ అయ్యారు.

నా రక్తమూ మరుగుతున్నది

- మన మీడియా సంయమనం పాటించాలి
- అప్పుడు సైనికులే చనిపోతే.. ఇప్పుడు పౌరులు చనిపోతారు
- త్రివిధ దళాలు ఒకేసారి దాడి చేస్తేనే మనకు నష్టం తక్కువ
- తెలుగువాళ్లు సైన్యంలో చేరాలి
- 'నమస్తే'తో 1965 ఇండో-పాక్ వార్ కెప్టెన్ పాండురంగారెడ్డి

అప్పటి యుద్ధానికి, ఇప్పటి యుద్ధాలకు మీరు ఎలాంటి తేడా గమనించారు?

అప్పుడు సైనికులే ఫేస్ టు ఫేస్ యుద్ధాలు చేసేవారు. చనిపోతే యుద్ధాల్లో సైనికులు చనిపోయేవారు. ఏ దేశాలు కూడా పౌరుల జోలికి వెళ్లేవి కాదు. చాలా తక్కువ ఘటనల్లో అప్పుడు సాధారణ పౌరులు చనిపోయిన ఘటనలు ఉన్నాయి. కానీ, ఇప్పుడు యుద్ధం వేరు. యుద్ధం డెఫినిషన్ వేరు. ఇప్పుడు యుద్ధం జరిగితే సాధారణ పౌరులు ఎక్కువగా చనిపోయే అవకాశం ఉంది. భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉంది. 1965లో యుద్ధం చేసినప్పుడు మేం సైనికులుగానే తలపడ్డాం.

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): పహల్గాం ఉగ్ర దాడిని చూస్తే తన రక్తం మరుగుతున్నదని 1965 ఇండియా-పాకిస్థాన్ యుద్ధంలో నేరు గా పాల్గొన్న తెలంగాణ బిడ్డ కెప్టెన్ లింగాల పాండురంగారెడ్డి 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో చెప్పారు. నాడు ఆయన పాకిస్థాన్ బుల్లెట్లకు ఎదురొడ్డి మరీ శత్రు సైనికులను సంహరించారు. నేటి యుద్ధం సందర్భంగా ఆనాటి తెగువను 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా మరోసారి ఆయన స్మరించుకున్నారు.

ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి తర్వాత మీకు ఏమనిపించింది?

ఆ రోజు నా మనసు ఎంత బాధపడిందో నాకే తెలుసు. కొత్తగా పెండ్లయిన జంటను విడదీసి మరీ కాల్చి చంపారని తెలిసిన తర్వాత ఈ వృద్ధాప్యంలోనూ ఓ సైనికుడిగా నా రక్తం మరిగింది.ఒక్కసారిగా నేను అనుభవించిన యుద్ధం కండ్లముందు కదలాడింది. అమాయకులను మతం అడిగి మరీ కాల్చారని టీవీల్లో బాధితులు చెప్పింది విన్న తర్వాత నా మనసు కలిచివేసింది. ఆ దురాగతానికి మన వాళ్ల ప్రతీకారచర్య తప్పకుండా ఉంటుందని అనిపించిం ది. సామాన్య ప్రజలను చంప డం పెద్ద పొరపా టు. ఏకే 47తో అమాయలను మతం అడిగి చంపడం అమానుషం, అనాగరికం కిందకే వస్తుంది. దానికి వాళ్లు కచ్చితంగా అనుభవిస్తారు.

'ఆపరేషన్ సిందూర్'తో మీ మనసు శాంతించిందా?

– 'ఆపరేషన్ సిందూర్'తో నేనొక్కడ్నే కాదు, యావత్ భారతం కొంత శాంతించింది. కానీ, శాశ్వత శాంతి కావాలని దేశం మొత్తం కోరుకుంటున్నది. అమాయకులు యుద్ధంలో బలికూడదనే ప్రాథమిక సూత్రం పాటించాలి. మన సైన్యం కూడా ఆపరేషన్ సిందూర్‌లో అదే చేసింది. ఇప్పటికి ఈ ప్రతీకార చర్య సమర్థనీయమే. పాకిస్థాన్ వంటి దేశంతో యుద్ధమంటే ఒకేసారి కొట్టిపడేయాలి. దశలవారీగా యుద్ధం చేయాలనుకోవడం మంచిది కాదు. త్రిముఖ వ్యూహంతో ఒకేసారి కొట్టాలి.

మనోళ్ల సన్నద్ధత ఎలా ఉందనిపిస్తున్నది?

మన వాళ్లు చాలా తెలివితో ఆలోచిస్తున్నారు. చాలా గొప్ప విషయం. చాలా సంమయనంతో ముందుకు వెళ్తున్నారు.. అది అభినందించదగిన అంశం. అలా చేయడమంటేనే ముందస్తు సన్నద్ధతో ఉన్నారని అర్థం. ఎలా వెళ్లాలి? సర్ ప్రైజ్‌గా ఎలా కొట్టాలి? ఎంత గట్టిగా కొట్టాలి? ఎంత తెలివిగా తిరిగి రావాలి? అనే వ్యూహం అందుకు తగిన సాంకేతిక పరిజ్ఞానం మన దగ్గర చాలా ఉంది. అందులో ఎలాంటి అనుమానం లేదు. వాళ్ల ప్రణాళిక వాళ్లకు ఉన్నది. ఈ విషయం మీద మేం తక్కువగా మాట్లాడాలి. 'ఆపరేషన్ సిందూర్'తో దేశమంతా ఒక్కటే మాట మాట్లాడింది. సైనికుడిగా నేను గర్విస్తున్నాను.

ఇప్పటి యుద్ధ వాతావరణాన్ని చూస్తుంటే మీకు ఎలా అనిపిస్తున్నది?

ప్రస్తుతం మనం మాట్లాడుకుంటున్న యుద్ధం మీడియా క్రియేట్ చేసిందే. ఏవేవో గ్రాఫిక్స్ పెట్టి.. మన దేశ సరిహద్దుల్లో యుద్ధం జరుగుతున్నట్టు క్రియేట్ చేస్తున్నారు. ఇలా చేయడమంటే ప్రత్యర్థులను మనమే అప్రమత్తం చేసినట్టు అవుతుంది. మనవాళ్లు ప్రతీకార దాడి చేశారు. అది కూడా సాధారణ పౌరులపై కాదు. కేవలం ఉగ్రవాదులు ఉన్న స్థావరాలపైనే దాడులు జరిగాయి. దానిని ఆధారం చేసుకొని కొన్నిచోట్ల పాక్ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నట్టు తెలుస్తున్నది.

వారికి గుణపాఠం చెప్పాల్సిందంటారా?

అది నూటికి నూరుపాళ్లు జరగాలి. ఇప్పటికే గుణపాఠం చెప్పాం. మళ్లీ కవ్వింపు చర్యలకు పాల్పడితే ఈ సారి మనవాళ్లు చాలా గట్టిగానే కొడతారు. ఆ దెబ్బకు పాక్ విలవిల్లాడటం ఖాయం. చేసేది చేస్తూనే ఉండాలి. కానీ చెప్పుకోవాల్సిన అవసరం లేదు. వెళ్లాలి.. కొట్టాలి.. రావాలి. ఇలాంటప్పుడు ఇజ్రాయెల్ వంటి టెక్నిక్‌ను మనం ఉపయోగించుకోవాలి. వాళ్లు కూడా అంతే టార్గెట్ ఫిక్స్ చేస్తే మాటలు ఉండవు. అన్నీ చేతలే. అమెరికా బిన్‌లాడెన్‌ను కొట్టినట్టు కొట్టాలి. మనవాళ్లు కూడా ఆ టెక్నిక్‌ను ఉపయోగించాలి. ఇప్పుడు కొట్టినదాని కంటే మరింత టెక్నిక్‌తో ఫినిష్ చేయాలి.

మీ కాలికి ఇంకా నాటి యుద్ధం మిగిల్చిన జ్ఞాపకం ఉన్నట్టుంది? క్లుప్తంగా చెప్తారా?

1961లో నా మొదటి పోస్టింగ్ డెహ్రాడూన్. మాది ఉమ్మడి వరంగల్ జిల్లా జనగామ దగ్గర నేరుమాల గ్రామం. 1965 ఇండో-పాక్ వార్ ఖేమకరణ్ సెక్టార్‌లో జరిగినప్పుడు నేరుగా యుద్ధంలో పాల్గొన్నా. ఇప్పుడున్న మేజర్ జనరల్ రావత్‌తో కలిసి పనిచేశా. మా ఇద్దరిదీ ఒకటే రైఫిల్. అక్కడ సిపాయిలు మొత్తం గూర్కాలే ఉంటారు. ఆఫీసర్లుగా మే ము ఉంటాం. అప్పుడు 22 రోజులపాటు యుద్ధం చేశాం. నా కుడి కాలికి బుల్లెట్ తగిలింది. చివరి యుద్ధం 1971లో జరిగింది.

ఆర్మీలో తెలుగువాళ్లు తక్కువున్నట్టున్నరు?

అవును. మన ఇండియన్ ఆర్మీలో తెలుగు రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం చాలా తక్కువ. అయితే, మనవాళ్లకే ధైర్యం ఎక్కువ. అందరి కంటే చాలా సాహసవంతులు. ఏపీ, తెలంగాణ సైనికులు చాలా ధైర్యవంతులు, తెలివిగల వాళ్లు కూడా. మిగతావారితో పోల్చితే మన వారికి పట్టుదల, మొండితనం చాలా ఉంటుంది. మన తెలుగు రాష్ట్రాల నుంచి ఆర్మీలో ఎక్కువ ప్రాతినిధ్యం ఉండాలి.

ఖర్జూరపండ్లు, రొట్టె తిని మాత్రమే యుద్ధం చేశారని విన్నాం నిజమేనా?

అప్పట్లో మేం యుద్ధంలో ఉన్నప్పుడు విజయంపైనే మా దృష్టంతా ఉండేది. ఏం తింటున్నామో, తాగుతున్నామో కూడా తెలిసేది కాదు. ఫుడ్ ఎప్పుడు వస్తుందో కూడా తెల్వకపోయేది. బుల్లెట్లతో పాటు రొట్టె, ఖర్జూరపండ్లు, మామిడికాయ పచ్చడి తీసుకెళ్లేవాళ్లం. ఫుడ్ లేని పక్షంలో రొట్టె మామిడికాయపచ్చడి వేసుకొని తిని వెళ్లేవాళ్లం. ఒక్కో రోజు ఖర్జూరపండ్లు తిని కొట్లాడేవాళ్లం. తెలుగువాడు తెలుగువాడే. అప్పట్లో మా ధైర్యమే వేరు. నాతో పాటు ఆ యుద్ధం చేసిన వారిలో ముగ్గురం బతికే ఉన్నాం.

అప్పటి యుద్ధ సాంకేతికత.. ఇప్పటి సాంకేతికత చూస్తే మీకు ఏమనిపిస్తుంది?

యుద్ధ పరికరాల్లో అంచనా వేయలేనన్ని మార్పులు వచ్చాయి. యుద్ధపరంగా సాంకేతికతను సమకూర్చుకోవడంలో, అత్యాధునిక ఆయుధాలను తయారు చేసుకోవడంతో మనకు మనమే సాటి. సైనికుల్లో ఎడ్యుకేషన్ పెరిగింది. టెక్నాలజీని బాగా వాడుతున్నారు. యుద్ధంలో ఆర్టిఫిషియల్ సాంకేతికత పెరిగింది. యుద్ధమంటే ఇప్పుడు మరోలా ఉంటున్నది. మిగతా దేశాలతో పోల్చితే భారత్ చాలా మెరుగ్గా ఉంది. కాబట్టి కొడితే ఒకేసారి గట్టిగా కొట్టాలనేది నా అభిప్రాయం. చర్యకు ప్రతిచర్య తప్పదు.. జైహింద్.

> **ఒకవేళ పాకిస్తాన్ నేరుగా యుద్ధానికి వస్తే పరిస్థితి ఏంటి? ఎలా ఎదుర్కొంటే త్వరగా విజయం సాధించొచ్చు?**
>
> పాకిస్తాన్ నేరుగా యుద్ధానికి వస్తే ఆ దేశానికి పెను నష్టం వాటిల్లుతుంది. మన దగ్గరున్న ఆయుధ సంపత్తి, సాంకేతిక పరిజ్ఞానం ముందు ఆ దేశం ఎటూ తలపడబోదు. మన మీదకు నేరుగా వస్తే మాత్రం నాది ఒక్కటే సూచన. త్రివిధ దళాలు ఒకేసారి యుద్ధరంగంలోకి దిగితే చాలా త్వరగా విజయం మనం సొంతం అవుతుంది. మన వైపు నష్టం తక్కువగా ఉంటుంది. అటువైపు పూర్తిగా తుడిచిపెట్టుకొని పోతుంది. ఆ విషయం పాక్‌కు కూడా తెలుసు. ఇప్పటికే మన వాళ్లు నైతికంగా నీళ్లు, ఎగుమతులు, దిగుమతులు, వాణిజ్యం వంటి అన్నింటిని ఆపేసి పరోక్షయుద్ధంలో విజయం సాధించారు కూడా.

- **కడసారి వీడ్కోలు**

పాకిస్థాన్ దాడిలో మరణించిన లాన్స్‌నాయక్ దినేశ్‌కుమార్‌కు హర్యానాలోని పల్వాల్ జిల్లాలో జరిగిన అంత్యక్రియల్లో శ్రద్ధాంజలి ఘటిస్తున్న కుటుంబసభ్యులు, స్థానికులు

జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో పాక్ షెల్లింగ్ దాడిలో దెబ్బతిన్న తన ఇంటిని పరిశీలిస్తున్న స్థానికుడు

జమ్ముకశ్మీర్‌లో అంతర్జాతీయ సరిహద్దు వద్ద ఉన్న ఓ గ్రామంలో బంకర్‌లో తలదాచుకున్న స్థానికులు

కనిపిస్తే కాల్చివేత

- సరిహద్దులో బీఎస్ఎఫ్‌కు ఆదేశాలు
- రాజస్థాన్, పంజాబ్‌లో అప్రమత్తం

న్యూఢిల్లీ, మే 8: పాకిస్థాన్ ఎటువంటి దుస్సాహసానికి దిగినా సమర్థంగా తిప్పికొట్టేందుకు సరిహద్దుల్లో భద్రతను మరింత పటిష్ఠం చేశారు. రాజస్థాన్‌లో ఉన్న పాక్ సరిహద్దును పూర్తిగా మూసివేశారు. ఆ ప్రాంతంలో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్)కు కనిపిస్తే కాల్చివేసే ఆదేశాలు ఇచ్చారు. పంజాబ్‌లో కూడా భద్రతా యంత్రాంగం పూర్తిగా సమాయత్తమైంది. అక్కడ పోలీసు సిబ్బందికి సెలవులు రద్దు చేశారు. రాజస్థాన్‌లో భారత్-పాక్ సరిహద్దు 1037 కిలోమీటర్ల పొడవున ఉంది. ఈ సరిహద్దు వెంట వైమానిక దళాన్ని అప్రమత్తంగా ఉంచారు. రాజస్థాన్‌లోని మూడు విమానాశ్రయాలను 2 రోజులపాటు మూసివేశారు. సరిహద్దు పట్టణాలైన బికనీర్, శ్రీగంగానగర్, జైసల్మేర్, బార్మర్‌లో స్కూళ్లు మూసివేసి, పరీక్షలను వాయిదా వేశారు. ఇక పంజాబ్‌లో ప్రభుత్వ కార్యకలాపాలన్నింటినీ రద్దు చేశారు.

పాక్ చొరబాటుదారుడి హతం

భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన పాకిస్థానీ పౌరుడు బీఎస్ఎఫ్ కాల్పుల్లో మృతి చెందాడు. ఆ వ్యక్తి ఈ నెల 7-8 తేదీల మధ్య రాత్రి చీకట్లో అంతర్జాతీయ సరిహద్దు గుండా భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించాడు.

27 ఎయిర్‌పోర్టులు తాత్కాలిక మూసివేత

430కిపైగా విమాన సర్వీసులు రద్దు

న్యూఢిల్లీ, మే 8: ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో దేశవ్యాప్తంగా 27 ఎయిర్‌పోర్టుల్లో విమాన సర్వీసుల్ని కేంద్రం తాత్కాలికంగా నిలిపివేసింది. దీంతో గురువారం ఒక్క రోజే 430కిపైగా ఫ్లైట్స్ రద్దు అయినట్టు, ఇందులో ఒక్క ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు రాకపోకలు సాగించే 90 ఫ్లైట్స్ ఉన్నాయని సమాచారం. ఇందులో 5 అంతర్జాతీయ విమానాలు ఉన్నాయని, వివిధ విమానయాన సంస్థల తమ విమానాలను రద్దు చేశాయని తెలిసింది. దేశ ఉత్తర, వాయువ్య, నైరుతి ప్రాంతాలు, మధ్య భారత్‌లోని పలు విమానాశ్రయాల్ని మే 10 వరకు తాత్కాలికంగా మూసివేసినట్టు వార్తలు వెలువడ్డాయి. దీంతో ఎయిర్ ఇండియా, ఇండిగో సహా వివిధ విమాయాన సంస్థలకు సంబంధించి వందలాది ఫ్లైట్స్ రీషెడ్యూల్ అయినట్టు తెలిసింది. 'ఫ్లైట్ స్టేటస్' తెలుసుకోవాలంటూ విమాన ప్రయాణికులకు ఎయిర్‌లైన్ సంస్థలు సూచించాయి.

సరిహద్దులో 'బీటింగ్ రిట్రీట్' నిలిపివేత

- **బీఎస్ఎఫ్ వెల్లడి**

న్యూఢిల్లీ, మే 8: పాకిస్థాన్ సరిహద్దు పోస్టుల వద్ద ప్రతి రోజూ సాయంత్రం నిర్వహించే 'బీటింగ్ రిట్రీట్' వేడుకలను నిలిపివేస్తున్నట్టు బీఎస్ఎఫ్ ప్రకటించింది. ప్రజా భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత్, పాకిస్థాన్, పీవోకేలోని 9 ఉగ్ర స్థావరాల్ని ధ్వంసం చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్టు బీఎస్ఎఫ్ తెలిపింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు అటారీ-వాఘా, హుస్సేన్‌వాలా, సాద్కీ సరిహద్దు పోస్టుల వద్ద 'బీటింగ్ రిట్రీట్' సహా ఎటువంటి ఉత్సవ ప్రదర్శనలూ ఉండవని, భద్రతను దృష్టిలో ఉంచుకొని అక్కడికి సాధారణ పౌరులెవ్వరినీ అనుమతించటం లేదని బీఎస్ఎఫ్ పేర్కొన్నది.

లద్దాఖ్‌లో డ్రోన్లు, యూఏవీలపై నిషేధం

లేహ్: లద్దాఖ్ కేంద్ర పాలిత ప్రాంతంలోని కార్గిల్, లేహ్ జిల్లాల్లో డ్రోన్లు, మానవ రహిత గగనతల వాహనాలు (యూఏవీ)లను ఎగురవేయడంపై నిషేధం విధించారు. ఈ జిల్లాల కలెక్టర్లు వేర్వేరుగా జారీ చేసిన ఆదేశాల్లో, దేశ వ్యతిరేక శక్తులు వీటిని దుర్వినియోగపరిచే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం అందినట్లు తెలిపారు. వీటిని ఎగురవేసే స్థానికులు, పర్యాటకులు లేదా ప్రైవేట్ వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రోన్ లేదా యూఏవీ ఎగురుతుండటాన్ని చూస్తే, వెంటనే ఆ సమాచారాన్ని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు లేదా సమీపంలోని పోలీసు లేదా ఇతర అధికారులకు తెలియజేయాలని కోరారు.

సైబర్ దాడులపై అప్రమత్తంగా ఉండాలి

- **కీలక రంగాలకు సెర్ట్ ఇన్ సూచన**

న్యూఢిల్లీ, మే 8: భారతీయ డిజిటల్ వ్యవస్థలపై సైబర్ దాడులు పెరగకుండా నిరోధించేందుకు తమ సైబర్ రక్షణ వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలని ఆర్థిక సంస్థలు, ఇతర కీలక రంగాలకు కంప్యూటర్ ఎమర్జన్సీ రెస్పాన్స్ టీమ్(సెర్ట్-ఇన్) ద్వారా భారత ప్రభుత్వం ప్రత్యేక సూచనలు జారీచేసింది. కేవలం ప్రభుత్వ వ్యవస్థలే కాక ప్రైవేట్ రంగంలోని పరిశ్రమలు కూడా సైబర్ దాడుల నుంచి తమను తాము కాపాడుకునేందుకు అత్యవసర చర్యలు చేపట్టాయి. పహల్గాం ఉగ్రదాడి జరిగినప్పటి నుంచి తాము సైబర్ భద్రత విషయంలో అదనపు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన ఉద్యోగి తెలిపారు. బ్యాంకులు, ఇతర కీలక రంగాలతోసహా ఆర్థిక రంగానికి చెందిన సంస్థలకు సెర్ట్ ఇన్ సూచనలు జారీచేసింది. మరింత విస్తృతంగా సంస్థలను అప్రమత్తం చేసే యంత్రాంగాన్ని ఏర్పాటు చేసేందుకు నాస్కామ్ వంటి పరిశ్రమలకు చెందిన సంస్థలతో ప్రభుత్వం చర్చలు జరుపుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

అమృత్‌సర్ ఎయిర్‌పోర్ట్ ముందు పంజాబ్ పోలీసుల భద్రత

సరిహద్దు రాష్ట్రాల్లో హై అలర్ట్

- పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ అప్రమత్తం
- బడులు మూత.. పోలీసుల సెలవులు రద్దు

చండీగఢ్/జైపూర్/అహ్మదాబాద్: 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర శిబిరాలపై భారత సైన్యం దాడులు జరిపిన నేపథ్యంలో దాయాది దేశంతో సరిహద్దును పంచుకుంటున్న రాజస్థాన్, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలు పూర్తిగా అప్రమత్తమయ్యాయి. పాక్ నుంచి వచ్చే ఎలాంటి ప్రతిఘటననైనా ఎదుర్కొనేందుకు పూర్తి అలర్ట్ మోడ్‌లోకి వెళ్లాయి. అందులో భాగంగా సరిహద్దు జిల్లాల్లోని స్కూళ్లను మూసివేశారు. పోలీసులు, పరిపాలనాధికారుల సెలవులు రద్దు చేశారు. వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ అయ్యాయి. పాకిస్థాన్‌తో పంజాబ్ 532 కిలోమీటర్లు, రాజస్థాన్ 1,070 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటుండగా, గుజరాత్ తీర ప్రాంతంతోపాటు కొంత భూభాగాన్ని పంచుకుంటోంది. ఈ నేపథ్యంలో సరిహద్దు జిల్లాలను అధికారులు అప్రమత్తం చేశారు. సరిహద్దు ప్రాంతాల్లో రాజస్థాన్ పోలీసులను మోహరించింది. నాలుగు సరిహద్దు జిల్లాలైన శ్రీ గంగానగర్, బికనేర్, జైసల్మేర్, బార్మర్‌లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లను ముందు జాగ్రత్త చర్యగా మూసివేసింది. పంజాబ్ కూడా ఆరు సరిహద్దు జిల్లాల్లోని స్కూళ్లను మూసివేసింది. పోలీసులు రెండో రక్షణ శ్రేణిగా పూర్తి సిద్ధంగా ఉన్నారని, పాకిస్థాన్ దాడికి తెగబడితే దీటుగా ప్రతిస్పందించేందుకు సైన్యంతో కలిసి పనిచేస్తారని పంజాబ్ మంత్రి అమన్ అరోరా తెలిపారు. ఇక, గుజరాత్ తీరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. సెలవుల్లో ఉన్న పోలీసులు అందరూ తక్షణమే విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని తీర ప్రాంత గ్రామాల ప్రజలను పోలీసులు కోరారు.

'నోట్ల కట్టల' జడ్జి అభిశంసన!

ఢిల్లీ హైకోర్టు జడ్జి యశ్వంత్ వర్మ తొలగింపునకు రాష్ట్రపతి, పీఎంలకు సిఫారసు చేసిన సీజేఐ

న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసనకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా సిఫారసు చేశారు. ఢిల్లీలోని వర్మ అధికారిక నివాసంలో కనిపించిన నోట్ల కట్టలపై దర్యాప్తు జరిపేందుకు సుప్రీంకోర్టు నియమించిన త్రిసభ్య కమిటీ నివేదిక ఆధారంగా సీజేఐ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆయనను అభిశంసించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీలకు సిఫారసు చేశారు. త్రిసభ్య కమిటీ నివేదికను, జస్టిస్ వర్మ స్పందనను ఈ సిఫారసుతోపాటు పంపించినట్లు సుప్రీంకోర్టు ఓ ప్రకటనలో తెలిపింది. కమిటీ నివేదిక ఈ నెల 3న, వర్మ స్పందన ఈ నెల 6న వచ్చినట్లు వివరించింది.

కమిటీ నివేదిక మేరకు..

పంజాబ్ అండ్ హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ షీల్ నాగు, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు సీజే జస్టిస్ జీఎస్ సంధవాలియా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్‌లతో కూడిన ఈ కమిటీ జస్టిస్ వర్మపై ఆరోపణలను ధ్రువీకరించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నివేదికను సహజ న్యాయసూత్రాలకు అనుగుణంగా జస్టిస్ వర్మకు అందజేశారు. వర్మను రాజీనామా చేయాలని సీజేఐ కోరినట్లు తెలుస్తున్నది. జస్టిస్ వర్మ ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పని చేసిన కాలంలో (మార్చి 14న) ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో అగ్ని ప్రమాదం జరిగింది. నివాస ప్రాంగణంలో పెద్ద ఎత్తున కరెన్సీ నోట్ల కట్టలు కనిపించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ కోసం ఢిల్లీ హైకోర్టు ఇన్‌హౌస్ ఇంక్వైరీ జరపడంతో పాటు సుప్రీంకోర్టు త్రిసభ్య కమిటీని నియమించింది. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ప్రమాద స్థలానికి వెళ్లిన ఢిల్లీ పోలీసు కమిషనర్, ఢిల్లీ అగ్నిమాపక శాఖ చీఫ్‌లతోపాటు దాదాపు 50 మందిని ఈ కమిటీ ప్రశ్నించి, స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది. అయితే, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు నియమించిన త్రిసభ్య కమిటీ ప్రశ్నించినపుడు జస్టిస్ వర్మ తనపై వచ్చిన ఆరోపణలను తిరస్కరించారు. రాజీనామా చేయాలని సీజేఐ ఇచ్చిన సలహాను జస్టిస్ వర్మ అంగీకరించకపోవడంతో, ఆయన అభిశంసనకు సీజేఐ సిఫారసు చేసినట్లు సమాచారం.

బిచ్చగాళ్లు లేని తొలి నగరం ఇండోర్

ఇండోర్: మన దేశంలో బిచ్చగాళ్లు లేని తొలి నగరంగా ఇండోర్ నిలిచింది. జిల్లా కలెక్టర్ ఆశిష్ సింగ్ గురువారం మాట్లాడుతూ, ఓ ఏడాది క్రితం వరకు నగర వీధుల్లో దాదాపు 5,000 మంది బిచ్చగాళ్లు ఉండేవారన్నారు. వారు ఉపాధి పొందేందుకు సహాయపడ్డామని తెలిపారు. బిచ్చమెత్తుకునే బాలలను పాఠశాలల్లో చేర్పించామని చెప్పారు. భిక్షాటనను నిర్మూలించేందుకు తాము అమలు చేసిన కార్యక్రమానికి కేంద్ర సాంఘిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, ప్రపంచ బ్యాంకు బృందం గుర్తింపు లభించిందన్నారు. భిక్షాటనను నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం 10 నగరాల్లో పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నది.

గంగోత్రి మార్గంలో కూలిన హెలికాప్టర్

పైలట్ సహా ఆరుగురి మృతి.. ఏపీ టీడీపీ ఎంపీ సోదరి దుర్మరణం

ఉత్తర కాశి: చార్‌ధామ్ యాత్రలో భాగమైన గంగోత్రి దేవాలయానికి వెళ్తున్న హెలికాప్టర్ గురువారం కూలిపోయింది. ఈ దుర్ఘటనలో పైలట్ సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఆరుగురు మహిళలు ఉన్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్ర విపత్తు స్పందన దళం విడుదల చేసిన ప్రకటనలో, ఈ హెలికాప్టర్ గురువారం ఉదయం 8.45 గంటలకు రిషికేశ్-గంగోత్రి జాతీయ రహదారిపై, ఉత్తర కాశి జిల్లా, గంగ్నానీ సమీపంలో కూలిపోయిందని, దాదాపు 250 మీటర్ల లోతైన లోయలో పడిపోయిందని తెలిపింది. గాయపడిన ఎం భాస్కర్ (51)ను రిషికేశ్‌లోని ఎయిమ్స్‌కు తరలించారు. ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర సంతాపం తెలిపారు.ఆంధ్ర ప్రదేశ్‌లోని అనంతపురం టీడీపీ ఎంపీ జీ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ, తన సోదరి వేదవతి (48) ఈ ప్రమాదంలో మరణించారని, తన బావ భాస్కర్ (51) గాయపడ్డారని, ఆయన రిషికేశ్‌లోని దవాఖానలో చికిత్స పొందుతున్నారని చెప్పారు.